ఆకునూరి మురళీకృష్ణ



# మహాయజ్ఞం

# మహాయజ్ఞం

(నవల)

## ఆకునూరి మురళీకృష్ణ

ఆకునూరి మురళీకృష్ణ
H.NO.970 (First Floor)
Sector 41 A
CHANDIGARH -160036
Phone : 082830 23210, 0172-2625638, 9848174957
E-mail : akunuri_murali@yahoo.co.in

# మహాయజ్ఞం

ఇంపోర్టెడ్ ఎయిర్ కండిషనర్ చల్లటి గాలిలో చక్కటి పరిమళాన్ని కూడా నింపి ఆ గదిలో పరుస్తోంది. పట్టపగలు కూడా దేదీప్యమానంగా వెలుగుతున్న తెల్లని ఫ్లోరసెంట్ బల్బులు తమ కాంతిని మొదట సీలింగ్ మీదకి ప్రసరింపచేసి కేవలం వెలుతురుని మాత్రం గదిలో పరావర్తనం చెందేలా చేస్తూ తమ వినమ్రతని చాటుకుంటున్నట్టున్నాయి.

చీకటి సామ్రాజ్యాధినేతలంటే సినిమాల్లో చూపించినట్లు చీకటి గుహల్లో వుండరన్న నిజం తెలిసిన ఆ నలుగురూ నీడకూడా పడని ఆ వెలుగులో అతడి ఎదురుగా కూర్చుని అతడి వంకే ఆసక్తిగా చూస్తూ కుర్చీల్లో ముందుకు వంగి అతడు చెప్పేది వినడం కోసం చెవులు రిక్కించారు.

అతడు యే రాష్ట్రానికి చెందినవాడో ఎవరికీ తెలియదు. హిందువో ముస్లిమో కూడా తెలియదు. ఆ మాటకొస్తే అతడి భాష, మతమే కాదు... అసలు అతడిదే దేశమో కూడా కచ్చితంగా ఎవరూ చెప్పలేనట్లుగా వుంటుందతని రూపం. ఆ విషయమై అతడిని అడిగేంత ధైర్యం ఇప్పటిదాకా ఎవరూ చేయలేదు. రోజుకొక దేశంలో తిరుగుతూ వుంటాడు, పూటకొక వేషం ధరిస్తూ వుంటాడు. ఇరవైరెండు భారతీయ భాషలతో పాటూ రకరకాల విదేశీ భాషలు కూడా అదే అతడి మాతృభాషేమోనని అనిపించేంత బాగా మాట్లాడగల అతడు సాధారణంగా ఎవరిముందూ పెదవి విప్పడు !

దేశంలో పెద్ద పెద్ద వ్యాపార వేత్తల దగ్గరనుంచీ ఫుట్ పాత్ వెండర్స్ దాకా, ముఖ్యమంత్రులూ ప్రధాన మంత్రుల దగ్గరనుంచీ చిన్ని చిన్న గల్లీ లీడర్లదాకా, అంతర్జాతీయ స్మగ్లర్ల దగ్గరనుంచీ పిక్ పాకెటర్స్ వరకూ అతని సామ్రాజ్యం విస్తరించి వుంటుంది.

అతడు తల్చుకుంటే బిచ్చగాడిని రాత్రికి రాత్రి కోటీశ్వరుడిని చేయగలడు... కోటీశ్వరుడిని బిచ్చగాడిని చేయగలడు. సామాన్యుడిని సెలబ్రిటీని చేయగలడు... పేరున్న సెలబ్రిటీని నామరూపాలు లేకుండా చేయగలడు ! అతడు తల్చుకుంటే ప్రభుత్వాన్ని కూల్చగలడు... కూలిపోతున్న ప్రభుత్వాన్ని నిలబెట్టనూగలడు !

కాంట్రాక్టులిప్పించడం దగ్గరనుంచీ ప్రత్యేక రాష్ట్రానికి ఉద్యమాలు చేయించడం వరకూ ఏ పనైనా చేయిస్తాడు కానీ అతడి పేరు మాత్రం ఎక్కడా బయటికి రాదు ! పార్టీలతో సంబంధం లేకుండా అతడి దగ్గరకి అందరూ వస్తూ వుంటారు. అతడికి శతృవులంటూ ఎవరూ వుండరు...

ఎందుకంటే అతడి దగ్గరకి వచ్చేవాళ్ళకెవరికైనా అతడివల్ల లాభమే కానీ నష్టం వుండదు. అదే అతని గొప్పతనం !

ఎదుటి మనిషిలోని బలహీనతని తన కొనకంటి చూపుతోనే కనిపెట్టగలగడం అతనిలో వున్న అతి పెద్ద నేర్పు. ఆ లక్షణమే అతడికి తన సామ్రాజ్యంలో తనకి ఎదురులేకుండా చేసింది. అతడి ఆస్థి మనిషిలోని బలహీనత... అతడి బలం మనిషిలోని బలహీనత... అతడి ఆయుధం మనిషిలోని బలహీనత ! అందువల్లే అతడు దశాబ్దకాలంగా తన కార్యకలాపాలని ఏ ఆటంకం లేకుండా యధేచ్ఛగా కొనసాగించగలుగుతున్నాడు. అతడు వాళ్ళకప్పగించబోయే కొత్త ఎసైన్‌మెంట్ గురించి వివరించడానికి ఆ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబడింది.

వాళ్ళ నలుగురి వంకా ఒకసారి చూసి, కుర్చీలో వెనక్కి వాలి ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా అతడు నెమ్మదిగా తనకి వచ్చిన కొత్త ఆలోచన గురించి వాళ్ళకి చెప్పడం మొదలు పెట్టాడు.

మామూలుగా వింటున్న వాళ్ళు అతడు చెప్పడం పూర్తి చేసే సరికి ఉద్వేగాన్ని ఆపుకోలేక కుర్చీల్లో నిఠారుగా అయిపోయారు ! అలాంటి ఆలోచన ఇంకొన్ని దశాబ్దాలు గడిచినా తమలో ఎవరికీ రాకపోవచ్చు... అంతటి అధ్భుతమైన పథకం అది !

అప్పటిదాకా అతడు నడిపించిన కార్యకలాపాలన్నీ ఒక ఎత్తయితే ఈ కొత్త కార్యక్రమం ఒకటీ ఒక ఎత్తు ! అతడికి వచ్చిన ఈ కొత్త ఆలోచన ఈ దేశంలో తమ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి తిరుగులేని ఆయుధం అవుతుందని వాళ్ళకి అప్పుడే అర్థమైపోయింది. అతడు చెప్పింది కనుక అమలుచేస్తే తమలాంటి వాళ్ళ కార్యకలాపాల్లోనే ఆ మార్పు ఒక సరికొత్త అధ్యాయమౌతుంది.

అపుకోలేని ఉద్వేగంతో వాళ్ళు నలుగురూ ముక్త కంఠంతో అన్నారు అతనితో "ఎక్సెలెంట్ !" అని.

అతడు వాళ్ళ కామెంట్సుని నవ్వుతూ స్వీకరించాడు. తన ఆలోచనని అమలు పరచడానికి రూపొందించిన పూర్తి పథకాన్నీ, ఆ పథకం అమలు చేయడానికి అనువైన ప్రదేశాన్ని, తాము అనుకున్నది జరగడానికి పట్టే కాలాన్ని లెక్కించి వాళ్ళకి మొత్తం వివరిస్తుంటే వాళ్ళు నోరు తెరుచుకుని వింటుండిపోయారు. అంతా వివరించాక వాళ్ళలో ఎవరెవరు ఏయే పనులు చేయాలో అతడు ఆదేశాలు జారీ చేసాడు.

"ఈ విషయాన్ని ఎవరికీ తెలియకుండా అత్యంత రహస్యంగా వుంచాలి" అని అతడు వాళ్ళకి చెప్పలేదు. కానీ అలా తెలిస్తే ఏం జరుగుతుందో వాళ్ళకి బాగా తెలుసు. అందుకే తమ నలుగురి ద్వారానే కాదు... భవిష్యత్‌లో మరెవరి వల్లా కూడా ఆ రహస్యం బయటికి రాకుండా చాలా కఠినమైన జాగ్రత్తలు వాళ్ళు తీసుకుంటారు.

మరికొంత సేపు మాట్లాడాక అతడు కుర్చీలోంచి లేచాడు. మర్యాద పూర్వకంగా వాళ్ళు కూడా లేచారు.

"మనం అనుకున్నది అనుకున్నట్టు జరిగితే..." ఆ నలుగురిలో ఒకతను ఉద్వేగం ఆపుకోలేక ఏదో చెప్పబోయాడు.

అతడు నవ్వుతూ ఆపాడు అతన్ని. "జరిగితే... కాదు. జరుగుతుంది. జరిగి తీరుతుంది! ఎందుకంటే నేను అనుకున్నది ఇక్కడ మాత్రమే సాధ్య పడుతుంది కనుక!" అన్నాడు.

వాళ్ళు అర్థంకానట్లుగా చూస్తుంటే "ఇక్కడ అంటే... ఈ దేశంలో అని నా ఉద్దేశం!" అన్నాడు అతడు వ్యంగ్యంగా.

అతడి మాటల్లో దాగున్న భావం అర్థమై చిన్నగా నవ్వేరు వాళ్ళు.

## ప్రారంభం

ఈ ప్రపంచానికి కొత్తగా చెప్పడానికి నాదగ్గిర ఏమీలేదు. సత్యం, అహింస అన్నవి పర్వతాలంత ప్రాచీనమైనవి – మహాత్మ గాంధీ.

ఎట్టి పరిస్థితుల్లోనూ సత్యాన్ని మాత్రమే చెప్పడం నిజాయితీ. అవసరాన్ని బట్టి అసత్యమాడడం మోసం. కొన్ని ప్రయోజనాలకోసం సత్యాన్ని దాచడం లౌక్యం. అయితే, స్వలాభంకోసం అసత్యాన్ని సత్యంగానూ సత్యాన్ని అసత్యంగానూ ప్రచారం చేయడమే రాజకీయం!

మనల్ని దెబ్బతీసిన వాడిని కూడా క్షమించి వదిలేయడం అహింస. మనల్ని దెబ్బతీసిన వాడిమీద అంతకంతా ప్రతీకారం తీర్చుకోవాలనుకోవడం హింస. మనల్ని దెబ్బతీస్తాడనుకున్న వ్యక్తినుంచి మనల్ని కాపాడుకోవడానికి మన బలాన్నుపయోగించుకుంటే అది ఆత్మరక్షణ. అయితే,

శత్రువు ఎత్తుని ముందుగానే ఊహించి అతడికన్నా ముందే అతడ్ని వెనుకనుంచి దొంగదెబ్బ కొట్టడమే రాజకీయం !

ఆవిధంగా సత్యం ముసుగులో అసత్యం, అహింస ముసుగులో హింస, రాజకీయానికి రెండు బలమైన ఆయుధాలుగా కొమ్ముకాస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు బానిసత్వం పోయి ప్రజాస్వామ్యానికి పట్టంకడుతున్నామనుకున్నారుకానీ రోజులు గడిచాకగానీ తెలియలేదు పట్టంకట్టింది ప్రజాస్వామ్యానికి కాదని, రాజకీయానికని !

ప్రజాస్వామ్యానికీ, రాజకీయానికీ తేడా చాలా చిన్నది. కానీ ఆ తేడా క్రమ క్రమంగా పెద్దదై వాటి మధ్య దూరం అగాధంలా పెరిగిపోతోంది... మర్యాదస్తులమనుకునే ప్రజలకీ రాజకీయాలకీ మధ్య పెరిగినట్టుగా...

***

ఆ మైదానమంతా ఎక్కడ చూసినా ఖాళీలేకుండా మనుషులు క్రిక్కిరిసిపోయి వున్నారు. అటు మనిషి ఇటు కదలడానికి కూడా వీలు లేదు. బయటికి పోకుండా గొర్రెలమంద చుట్టూ చట్రాలు బిగించిన వల కట్టినట్లుగానే ఆ మైదానం నిండా ఎక్కడికక్కడ కర్రలతో బారికేడ్లు కట్టేసి వున్నాయి. గొర్రెలని అదిలిస్తూ తిరిగే కాపరుల్లా అక్కడక్కడా కర్రలు పట్టుకుని వాలంటీర్లు తిరుగుతున్నారు.

సమయం మిట్ట మధ్యాహ్నం రెండు గంటలు. అప్పటికి దాదాపు మూడు గంటలనుంచీ అందరూ అలాగే కదలకుండా కూర్చుని రంగు రంగుల పూలతోనూ, పార్టీ జెండాలతోనూ అలంకరించిన వేదికకేసి చూస్తూ రాబోయే పెద్దవాళ్ళ గురించి ఎదురుచూస్తున్నారు. మీటింగ్ ఇదుగో మొదలౌతుంది అదిగో మొదలౌతుందంటూ ఎటూ కదలనీయడంలేదు.

సరిగ్గా గంట ముందు అందరికీ పులిహోర పేకట్లు, మంచినీళ్ళ పేకెట్లు పంచి పెట్టారు వాలంటీర్లు. పులిహోర పేకట్లతో సమంగా మంచినీళ్ళ పేకెట్లు రాకపోవడంతో అవి అందరికీ అందలేదు. పొద్దున్నుంచీ మంచి ఆకలి మీద వుండడంతో ఆ విషయాన్ని పట్టించుకోకుండా ఆత్రంగా తినేసిన జనాలకి తిన్నాక కానీ అర్థంకాలేదు మంచినీళ్ళ అవసరం.

"దాహంగావుంది నీళ్ళు కావాలి..." అటుగా వచ్చిన వాలంటీర్లని అడిగారు మంచినీళ్ళ పేకెట్లు దొరకని కొంతమంది.

వాళ్ళ మాటలు వినిపించినా వినీ విననట్లు ఊరుకుంటున్నారు వాలంటీర్లు. వచ్చిన మంచినీళ్ళ పేకట్లన్నీ అయిపోయాయి. ఇప్పుడు నీళ్ళుకావాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం వెళితేకానీ దొరకవు. ఒకవేళ దొరికినా తీసుకొచ్చి అందివ్వడానికి వాళ్ళకి అప్పగించిన డ్యూటీ మంచినీళ్ళు సరఫరా చేయడం కాదు. అందుకే చుస్తూ ఊరుకున్నారు తప్ప వాళ్ళకి సమాధానం చెప్పలేదు వాలంటీర్లు. మరీ గట్టిగా అడిగినవాళ్ళని మాత్రం " ఇప్పుడు కాదు... కాసేపాగండి, మీటింగ్ మొదలైపోతోంది " అంటూ కంట్రోల్ చేస్తున్నారు.

ఊరికి అంత దూరంలో బహిరంగ సభ ఏర్పాటు చేసిన నిర్వాహకులకి జనాలకి కనీస అవసరమైన మంచినీళ్ళు అందుబాటులో వుంచాలన్న ఆలోచన రాలేదు. వాళ్ళ బుర్రలన్నీ వచ్చే పెద్దవాళ్ళ అవసరాలగురించిన ఆలోచనలతోనే నిండిపోయి వున్నాయి.

దాహాన్ని భరించలేక కొంతమంది బయటికి వెళ్దామని ప్రయత్నిస్తుంటే "ఇప్పుడు బయటికి వెళ్ళకూడదు. మీటీంగ్ మొదలైపోతుంది" అంటూ వాలంటీర్లు అడ్డుకున్నారు. చేసేదేమీలేక ఆగిపోయారు వాళ్ళు. వాళ్ళిచ్చే డబ్బులకోసం కక్కుర్తిపడి మిట్టమధ్యాహ్నం ఎండలో వచ్చినందుకు తమని తామే తిట్టుకున్నారు. సినిమా హీరో వస్తున్నాడు, భోజనాలు కూడా పెడతాం కూర్చుని చూడడమే అంటే వచ్చేరు. ఇప్పటిదాకా ఎదురుచూడడమే సరిపోయింది.

దాహానికి అందరి నోళ్ళూ ఖాళీ చేసిన పులిహార పొట్లాల్లా ఎండిపోతున్నాయి. వేదిక మీద టేబిల్స్‌పైన అతిధులకోసం సిద్ధంగా వుంచిన మినరల్ వాటర్ బాటిల్స్ ఊరిస్తూ కనబడుతున్నాయి.

సహనం నశించిపోయి "మంచినీళ్ళివ్వండి లేకపోతే మేం బయటికిపోతాం" అంటూ గట్టిగా గొడవ పెట్టసాగారు కొంతమంది.

అప్పుడు కదలిక వచ్చింది వాలంటీర్లలో. ఈ గొడవ పెద్దదైతే తమకి అక్షింతలు పడే ప్రమాదముందన్న భయంతో విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్ళారు.

"తెప్పించిన మంచినీళ్ళ పేకట్లన్నీ ఏమైపోయాయి ?" అంటూ ఎదురు ప్రశ్న వేసారు వాళ్ళు.

ఎన్ని పేకెట్లు తెచ్చారో ఎవరికీ తెలియదు. వాలంటీర్లు తెల్లముఖం వేసారు.

"వున్నవి సరిపెట్టుకోమనండి. ఇప్పుడు కొత్తగా తెప్పించాలంటే కుదరదు"

"తెచ్చిన పేకెట్లన్నీ అయిపోయాయి. జనం దాహానికి ఆగలేమంటున్నారు వాళ్ళు అడుగుతున్నది పులిహారపొట్లాలు కూడా కాదు. మంచినీళ్ళు. ఎండ దంచేస్తోంది సరిపెట్టుకోమని ఎలా చెబుతాం ?" కుర్ర వాలంటీరులా వున్న అతను ధైర్యంచేసి అన్నాడు.

"ఎందుకు సరిపెట్టుకోరు ? డబ్బులిచ్చేము కదా ?" అన్నాడు నిర్వాహకుడు డబ్బులిస్తే దాహం తీరిపోతుందన్నట్టుగా. ఇప్పుడు మళ్ళీ మంచినీళ్ళు సరఫరా చేయాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం నించి తెప్పించాలి... అతడి మనసులో ఏవేవో లెక్కలు కదిలాయి...

"కాసేపాగితే వాళ్ళే సర్దుకుంటారు. ఆర్డర్ ఇచ్చాం వస్తున్నాయని చెప్పండి. గొడవ ఆగుతుంది" ఖద్దరు చొక్కా జేబులోంచి మోగుతున్న సెల్‌ఫోన్‌ని బయటికి తీస్తూ అన్నాడా నిర్వాహకుడు. ఫోన్లో మంచినీళ్ళ సంగతేమైనా చెబుతాడేమోనని కాసేపు ఎదురుచూసారు వాలంటీర్లు. కానీ అతడు వేరే ఏదో విషయమ్మీద మాట్లాడుతూ అక్కడినుంచి వెళ్ళిపోవడంతో చేసేదిలేక అతను చెప్పిన అబద్ధాన్నే జనానికి చెప్పాడానికి కదిలారు. అయితే, ఆ నిర్వాహకుడు అనుకున్నట్టుగా ఆ గొడవ అంత సులువుగా సర్దుమణిగిపోలేదు.

***

బహిరంగసభ ఏర్పాటుచేసిన ప్రదేశానికి కొంత దూరంలో ప్రభుత్వ అతిథిగృహంలో సోఫాలో కూర్చుని ఎదురుచూస్తున్నాడు మంత్రి కోటేశ్వరరావు. ఆ ఎ.సి. రూమ్‌లో కూడా నుదుటిన పడుతున్న చెమటని అసహనంగా తుడుచుకుంటున్నాడు. పార్టీలో తమ ఏరియాకి సంబంధించినంతవరకూ అతను తిరుగులేని నాయకుడు. అతని చుట్టూ ఇతర నాయకులు, చిన్న చిన్న లీడర్లూ వున్నారు. ఢిల్లీ నుంచి వస్తున్న నేషనల్ లీడర్స్‌తో పాటూ రావాల్సిన సినిమా హీరో నాగరాజు గురించే అందరూ ఎదురుచూస్తున్నారు.

అలా ఎదురుచూడడం కోటేశ్వర్రావుకి చిరాకుగా వుంది. హైదరాబాద్‌నుంచి హెలికాప్టర్ బయలుదేరుతోందన్న విషయం తెలియగానే అతడు ఆఫీసునుంచి బయలుదేరాడు. తీరా ఇక్కడికొచ్చాక తెలిసింది హెలికాప్టర్ బయలుదేరడానికింకా ఆలస్యముందని. రెండు గంటలమందే హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సిన వాళ్ళ హెలికాప్టర్ ఇంకా బయలుదేరకపోవడానికి కారణం సినిమా హీరో నాగరాజు రావడం ఆలస్యంకావడమే అన్న విషయం తెలుసుకున్న కోటేశ్వర్రావుకి అసహనంగా అనిపించింది.

ఒక స్టేజికి వచ్చేసాక చిన్న చిన్న పనులు చేయాలంటే అవమానంగా వుంటుంది. తన చుట్టూ వుండే అనుచరగణానికి తనే హీరో... కానీ ఇప్పుడు తనుకూడా వాళ్ళతో సమంగా వచ్చే వాళ్ళకోసం ఎదురుచూడడం, తనతో సహా అందరూ తనకి కాకుండా వేరే వాళ్ళకి ప్రాముఖ్యత ఇవ్వవలసి రావడం

అతనికి కొంచెం ఇబ్బందిగా వుంది. అలాంటి సభలు ఏర్పాటు చేయాల్సివచ్చినపుడల్లా అతనికలాగే అనిపిస్తుంది. కానీ ఇన్నాళ్ళ రాజకీయ అనుభవం నేర్పిన లౌక్యంవల్ల మనసులోని భావాలని తెలియనీయకుండా పైకి మాత్రం ప్రసన్నంగా నవ్వుతూ కనిపిస్తున్నాడు.

"ధనుంజయ ఎక్కడ ?" ఏమీ తోచక అడిగాడు పక్కనున్న వాళ్ళని.

అతని చుట్టుపక్కలవారిలో కదలిక వచ్చింది. అతని ప్రశ్న సెకన్లమీద అలా అంచెలంచలుగా బయలుదేరి బయట కారిడార్లో ఎవరితోనో మాట్లాడుతున్న ధనుంజయని చేరింది.

"పెద్దాయన పిలుస్తున్నారు" అన్నారెవరో అతనితో.

'పెద్దాయనంటే ఎవరని' ధనుంజయ ప్రశ్నించలేదు. అతనికి సంభందించినంత వరకూ, అక్కడున్న వాళ్ళకి సంభందించినంత వరకూ పెద్దాయనంటే కోటేశ్వర్రావే.

అప్పటిదాకా తను మాట్లాడుతున్న వ్యక్తితో సంభాషణని క్షణాల్లో కుదించేసి కంక్లూడ్ చేసి అతనికి ఇవ్వాల్సిన మెసేజ్ ఇచ్చేసి లోనికి కదిలాడతను. ఎంత హడావిడిలో వున్నా చేసే పనిని మధ్యలో ఆపకపోవడం అతని లక్షణం. 'ఒక కొత్త పని మొదలుపెట్టామని చేస్తున్న పని వదిలిపెట్టేసామంటే మనకి పనిమీద గౌరవం లేనట్టు...' అంటాడతను. అతని వయసు కూడా దాదాపు కోటేశ్వర్రావు వయసుతో సమానంగా వుంటుంది. అతనిలోని ఇలాంటి లక్షణాలవల్లే అతను కోటేశ్వర్రావుకి బాగా నచ్చుతాడు. ఆ లక్షణాలే అతన్ని మంచి అడ్మినిస్ట్రేటర్‌గా నిలబెట్టాయి. అందువల్లే అతనిన్నాళ్ళుగా కోటేశ్వర్రావుకి ముఖ్యమైన అంతరంగికుడుగా కొనసాగుతున్నాడు.

ధనుంజయ కోటేశ్వర్రావు దగ్గిరకి వచ్చి తను హైదరాబాద్ నుంచి సేకరించిన సమాచారం చెప్పాడు. సినిమా హీరో నాగరాజు వచ్చేసాడట. ఆయన మేకప్ పూర్తవగానే హెలికాప్టర్ బయలుదేరుతుందట.

'పథకాలు రూపొందించడంలోనూ రాజకీయాలు నడపడంలోనూ ఎంత నిష్ణాతులైనా ఇన్‌స్టంట్‌గా జనాన్ని ఆకట్టుకోవడానికి మాత్రం తామింకా సినిమా గ్లామర్ మీదనే ఆధారపడాల్సివస్తోంది' చిరాగ్గా అనుకుంటూ సోఫాలోంచి లేచి బయటికి కదిలాడు. అతనితోపాటూ మిగిలిన వాళ్ళు కూడా లేచారు.

కోటేశ్వర్రావు బయటికి రావడంతో అప్పటిదాకా కారిడార్లోనూ చెట్లకిందా కూర్చున్న మరంత చిన్న చిన్న లీడర్లు, కార్యకర్తలు వచ్చి చుట్టూ మూగారు. అతనంటే వున్న భయం వల్లో గౌరవం వల్లో ఎవరికీ ఏం మాట్లాడాలో అర్ధంకావడంలేదు.

కోటేశ్వర్రావే మెల్లిగా వాళ్ళతో సంభాషణ ప్రారంభించేడు.

అంతలో అతని ఎడమచేతివైపు జేబులో వున్న సెల్ ఫోన్ లోంచి చిన్నగా బీప్ మన్న శబ్దం వచ్చింది. ఆయన జేబులోంచి సెల్ బయటికి తీసి చూసాడు.

"For the longest time it seemed that life was about to start. Real life. But there was always some abstacle along the way, an ordeal to get through, some work to be finished,  Then life would start. I finally came to understand that those abstacles were life"

ఆ మెసేజ్ చదవగానే ఆయన పెదాలు అప్రయత్నంగా విచ్చుకున్నాయి. అప్పటిదాకా అనుభవించిన టెన్షన్ మాయమై మెదడు రిలాక్సయినట్లనిపించింది. ఆ మెసేజ్ పంపించిన వాళ్ళ పేరు చదివాక అతని సంతోషం సంతృప్తిగా మారింది... ఆ మెసేజ్ పంపించింది కాలేజ్‌లో చదువుతున్న అతని కూతురు హంసలేఖ.

అతడు సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుంటుంటే ధనుంజయ వచ్చి చెప్పాడు "హెలికాప్టర్ బయలుదేరిందట" అని.

***

ఈ దేశంలో చాలా సులువైన విషయం నాయకుడు తయారవ్వడం. సామాన్యజానాన్ని అన్నింటికన్నా అమితంగా ఆకట్టుకునేది తమకి కావాల్సిందాన్ని ఎదుటి వారినుంచి డిమాండ్ చేయడం. అయితే అలా డిమాండ్ చేయడానికి స్వతహాగా వారికి ధైర్యం వుండదు. తమ ముందు ఒకడున్నాడని తెలిస్తే మాత్రం అతనివెనుక నడవడానికీ అతనితో గొంతుకలపడానికీ సంకోచంలేకుండా ప్రతి ఒక్కరూ ముందుకి వస్తారు. ఏరకమైన ప్రశ్నలూ వేయకుండా అతడిని నాయకుడిగా అంగీకరించి అతని వెనుక నడుస్తారు. ఆవిధంగా నలుగురు మనుషులున్న చోట ఆ నలుగురిలోంచే చాలా సులువుగా ఒక నాయకుడు పుడతాడు.

వాలంటీర్లు ఎంతకీ మంచినీళ్ళు సరఫరా చేయకపోవడంతో కాసేపటికి ఆ గుంపులోంచే మంచినీళ్ళపేకట్లు సాధించడం కోసం ఒక నాయకుడు తయారయ్యాడు. 'మంచినీళ్ళైనా ఇవ్వండి...

బయటికేనా పంపండి...' అంటూ ప్రారంభమైన నినాదాలు అధికార పార్టీ డౌన్ డౌన్ అనేంతదాకా వచ్చాయి. గొంతెండిపోతున్న బాధలో అతనెలా చెబితే అలా అరవసాగారు అతని వెనుకనున్న జనం.

పరిస్థితి చెయ్యిదాటిపోతోందన్న అనుమానం వచ్చిన వాలంటీర్లు మరోసారి నిర్వాహకుల దగ్గరకెళ్ళి విన్నవించుకున్నారు. అంతలో హడావిడిగా అటువైపు వచ్చిన ధనుంజయ దృష్టిలో ఆ గొడవ పడింది. " ఇంత జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా ? " అంటూ ఆర్గనైజర్లని చీవాట్లు వేసాడు.

"ఎన్ని మంచినీళ్ళ పేకెట్లు ఆర్డరిచ్చారు ?" అని అడిగాడు. సాధారణంగా అలాంటి చిన్న చిన్న విషయాలు అతడు ఎంక్వయిరీ చేయడు.

వాళ్ళు చెప్పిన సమాధానం విని ఒక్కసారి మైదానంలోని జనం వంక చూసాడు.

"మీరు చెప్పినదాని ప్రకారం ఒక్కొకరికీ ఒక ప్యాకెట్ ఇచ్చినా ఇంకా చాలా ప్యాకెట్లు మిగిలిపోవాలి. అసలు డెలివరీ అయిన ప్యాకెట్లనెవరేనా చెక్ చేసారా ?"

ఆర్గనైజర్లు ముఖాలు చూసుకున్నారు. ఎవరూ చెక్ చేయలేదు. భయపడుతూ తలలడ్డంగా ఊపారు.

"సప్లయిర్‌కి ఫోన్ చెయ్యండి"

సెల్ ఫోన్ తీసి ఫోన్ చేసాడు వాళ్ళలో ఒకడు.

"క్షమించాలి. చిన్న పొరపాటు జరిగిపోయింది. మీరు చెప్పిన ప్రకారం ప్యాకెట్లు ట్రక్కులో లోడ్ చేసి పంపించేం. మధ్యదారిలో కొన్ని పేకెట్లు పొరపాట్న రాంగ్ డెలివరీ అయ్యాయి. ఆ విషయం మేము కూడా ఇప్పుడే గమనించాం. మిగిలిన లోడ్ ఇప్పుడే మీకు పంపించేస్తాం"

అటునుంచి వచ్చిన సమాధానాన్ని విన్న ధనుంజయ ముఖం ఎర్రగా అయింది. దారిలో రాంగ్ డెలివరీ పొరపాట్న జరగలేదని, కావాలనే చేసారని, ఇక్కడెవరు చెక్ చేసుకుంటార్లే అన్న ధైర్యంతో చేసారనీ అతనికర్థంకాకపోలేదు.

"మీరేం చేస్తారో నాకు తెలియదు. మాకు అర్జెంట్‌గా ట్రక్కు లోడు వాటర్ ప్యాకెట్లు కావాలి... ఎంత ఖర్చయినా ఫరవాలేదు ఈసారి మాత్రం తేడా వస్తే తేడా వస్తే మీరింక వ్యాపారం చేసుకోలేరు" హెచ్చరిస్తూ అన్నాడు ధనుంజయ.

ఈలోగా హెలికాప్టర్ వచ్చేసింది. హైదరాబాద్ నుంచి వచ్చిన నాయకులు నేరుగా వేదిక వద్దకి చేరుకున్నారు. వేదికంతా కోలాహలంగా తయారైపోయింది. కార్యకర్తల హడావిడి మెదలయింది. ఎవరో వేదికనెక్కి ఒక్కో నాయకుడినీ ఆహ్వానిస్తున్నారు. జనంలో మాత్రం మంచినీళ్ళ పేకెట్లు సృష్టించిన వేడి ఇంకా చల్లారలేదు. నినాదాలు ఎక్కువయ్యాయి. ఆ గోలలో వాళ్ళేమని అరుస్తున్నారో ఎవరికీ వినపడటంలేదు కానీ విషయాన్ని ఎంతోసేపు దాచడం సాధ్యంకాదని ధనుంజయకి అర్థమైపోతోంది. దానికి తోడు పత్రికలవాళ్ళు వుండనే వున్నారు...

మంచినీళ్ళు రావాలంటే ఇంకా అరగంటేనా పడుతుంది. అంతదాకా జనాన్ని ఆపడం ఎలా ?

ధనుంజయ మెల్లిగా వెళ్ళి కోటేశ్వర్రావుకి జరిగిన విషయం చెప్పాడు. కోటేశ్వర్రావు ముఖంలో ఖంగారు కనబడింది.

జనంలో అలజడిని గమనించిన ఢిల్లీ నాయకుడు అడిగాడు కోటేశ్వర్రావుని భాష అర్థంకాక "ఏమిటంటున్నారు వాళ్ళు ? దేనికోసం గొడవ పెడుతున్నారు ?"

"వాటర్... దే ఆర్ ఆస్కింగ్ ఫర్ వాటర్" అన్నాడు కోటేశ్వర్రావు.

"మంచినీటి సమస్యగురించా ? ప్రతీ చోటా వున్నదేకదా ? మన ప్రసంగంలో దాన్ని తీర్చేస్తామని వాగ్దానం చేసేస్తే పోలా ?" అన్నాడు నవ్వుతూ.

కోటేశ్వర్రావుకి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. జనం ఏ క్షణంలోనైనా వేదిక మీద దాడి చేసేలా వున్నారు. ఈలోగా ధనుంజయ వచ్చి ఆయనకి చెవిలో ఏంచేయాలో చెప్పాడు.

కోటేశ్వర్రావు ధనుంజయ చెప్పినట్లుగా మైకుదగ్గిరకి వచ్చి సినీ హీరో నాగరాజుని వేదిక మీదికి రావాల్సిందిగా ఆహ్వానించాడు.

అప్పటిదాకా తనని చుట్టుముట్టేసిన అభిమానులతో ముచ్చటిస్తూ వేదిక మీదికి రాని నాగరాజు ఆయన ప్రకటన విని సెక్యూరిటీ గార్డుల సహాయంతో వాళ్ళని తప్పించుకుని నెమ్మదిగా వేదికి మీదికి వచ్చాడు. వేదిక మీదికి వచ్చి తన స్టైల్లో ప్రజలకి అభివాదం చేసాడు.

ఒక్కసారిగా వెయ్యి సముద్రకెరటాలు ఎగసిపడినట్లుగా జనంలో ఘోష... అరుపులు, గోల... ఈలలు...

జనం స్పందనని చూసిన నాగరాజు తన సహజమైన నటనా చాతుర్యంతో మళ్ళీ అన్ని వైపులకీ తిరిగి వాళ్ళకి మరోసారి అభివాదం చేసాడు. జనం నుంచి మళ్ళీ అదే స్పందన...

"ఇప్పుడు మీ అభిమాన హీరో నాగరాజుగారు ప్రసంగిస్తారు" అంటూ మైకులో అనౌన్స్ చేసేసాడు కోటేశ్వర్రావు.

మైదానం దద్దరిల్లిపోయేలా చప్పట్ల మోత...

ఢిల్లీ నుంచి వచ్చిన నాయకులు ముఖా ముఖాలు చూసుకున్నారు. నేషనల్ లీడర్స్ అయిన తమని వదిలేసి ముందుగా ఆ సినిమా హీరోని ప్రసంగించమంటున్నాడేమిటని.

నాగరాజు మైకు దగ్గిరకి వచ్చి గొంతు సవరించుకున్నాడు. ధనుంజయ మెల్లగా అతని వెనక్కి వచ్చి అతని చెవిలో నెమ్మదిగా ఏదో చెప్పాడు. ధనుంజయ చెప్పినదానికి నాగరాజు చిన్నగా నవ్వాడు.

"ఆహూతులకీ అభిమానులకీ వందనం..." అంటూ గంభీరంగా ప్రారంభమైన అతని ప్రసంగం తన సినిమాల్లోని డైలాగులతో, అక్కడక్కడ రాజకీయ చమక్కులతో అనర్గళంగా సాగిపోయింది దాదాపు అరగంటపాటూ.

జనం నినాదాల సంగతి, మంచినీళ్ల సంగతి కూడా మర్చిపోయి నోళ్ళు తెరుచుకుని ఈలలు వేస్తూ చప్పట్లు కొడుతూ అతని ప్రసంగాన్ని వినసాగారు. ఈలోగా మంచినీళ్ళ పేకెట్లు వచ్చేసాయి. వాలంటీర్లనీ, ఆర్గనైజర్లనీ అందర్నీ పిలిపించి క్షణాల్లో వాటిని పంపిణీ చేయించాడు ధనుంజయ. నాగరాజు ప్రసంగం ముగిసి జనం ఈలోకంలోకి వచ్చేసరికి అందరి చేతుల్లోనూ మంచినీళ్ళ పేకెట్లున్నాయి.

అంత పెద్ద ప్రమాదాన్ని సమయస్ఫూర్తితో తప్పించిన ధనుంజయ వైపు కృతజ్ఞతగానూ, తన ఇమేజ్‌తో జనాన్ని అరగంటపాటూ మంత్రముగ్ధుల్ని చేసేసిన నాగరాజు వైపు ఆరాధనగానూ చూసాడు కోటేశ్వర్రావు. ఆ తర్వాత సభ నిరాటంకంగా జరిగిపోయింది. అయినా కోటేశ్వర్రావు మనసులో ఏదో భయం పీకుతూనే వుంది. అతను భయపడ్డట్టుగానే బహిరంగ సభ ముగుస్తూనే విలేఖరులు అతడిని చుట్టు ముట్టేరు.

"ఇంత పెద్ద ఎత్తున బహిరంగ సభకి పిలుపునిచ్చి వచ్చే జనాలకి సరైన ఏర్పాట్లు చేయలేదని తెలుస్తోంది. జనం మంచినీళ్ళు కూడా దొరకక ఇబ్బంది పడ్డారని తెలిసింది. దీనికి మీరేమంటారు ?" ప్రశ్నిస్తున్న విలేఖరుల వైపు ఒక్క క్షణం సాలోచనగా చూసాడు కోటేశ్వర్రావు.

"ఇక్కడ తాగడానికి మంచినీళ్ళు కూడా దొరకవని తెలిసే అందరికీ పంచడానికి లారీడు మంచినీళ్ళ పేకెట్లు ఆర్డరిచ్చాం. కానీ ప్రతిపక్షాల వాళ్ళు కుట్రచేసి వాటిని దారి మళ్ళించి జనాన్ని నీళ్ళివ్వకుండా హింసించి మాకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాలని చూసారు. దీన్ని మేము ఆధారాలతో సహా నిరూపించగలం. ఇంతకన్నా రాక్షసత్వం వుంటుందా ? కక్ష వుంటే మామీద తీర్చుకోవాలి కానీ మా మీటింగ్ వచ్చిన ప్రజల మీదా ? సమయానికి మేము తేరుకుని స్పందించబట్టి ఎవ్వరూ ఇబ్బంది పడలేదు కానీ లేకపోతే అందరూ నీళ్ళు దొరక్క అల్లాడే వారు..." తమవాళ్ళ నిర్లక్ష్యాన్ని ప్రతిపక్షాలవారి కుట్ర అన్నట్లుగా... జరిగినదాంట్లో తమ తప్పేం లేనట్లుగా రంగుపూసి చెప్పసాగాడు కోటేశ్వర్రావు వాళ్ళకి. అతడికి తెలుసు మర్నాడు ఆ వార్త అన్ని పేపర్లలోనూ ప్రముఖంగా వస్తుందని.

రాజకీయాల్లో మన మీద దాడి జరుగుతుందని తెలిసినపుడు మనల్ని మనం రక్షించుకోవడం కన్నా ముందుగానే ఎదురుదాడి మొదలుపెట్టాలి. అంత పెద్ద బహిరంగ సభకి సరైన ఏర్పాట్లు చేయలేదంటే తమకి ప్రజల్లో చెడ్డ పేరువస్తుంది. ప్రతిపక్షాల వారికి కోతికి కొబ్బరికాయ దొరికినట్లవుతుంది. అందుకే వాళ్ళు తమని విమర్శించడంకన్నా ముందే జరిగినదానికంతా ప్రతిపక్షాలవాళ్ళే కారణమనేస్తే వాళ్ళని వాళ్ళు డిఫెండ్ చేసుకునే పనిలో పడి తమ మీద దాడి చేసే అవకాశం లేకుండా పోతుంది వాళ్ళకి. జరిగిన దాంట్లో నిజమెంతుందన్నది ఎవరికీ అనవసరం... విషయం క్రమంగా పల్చబడిపోతుంది. అందుకే వర్షాలు సరిగ్గా పడకపోవడానికి కూడా ప్రభుత్వమే కారణమంటే అదే రాజకీయమౌతోంది. ఆ వార్తలనే పేపర్లలో రాస్తున్నారు... జనం చదువుతున్నారు !

విలేఖరులు వేడివేడి వార్తని ఎవరి తరహాలో వాళ్ళూ రాసుకుంటుంటే కోటేశ్వర్రావు ఎ.సి.కారులో బయలుదేరాడు. ధనుంజయ ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా కార్యకర్తలకి మైదానంలో క్లాసు తీసుకుంటున్నాడు. అయితే ఇక్కడ విలేఖరులకి తెలియనిదీ కేవలం ధనుంజయకీ, కోటేశ్వర్రావుకీ మాత్రమే తెలిసిన విషయం ఒకటి వుంది.

End of Preview.

Rest of the book can be read @

http://kinige.com/book/Mahayagnam

* * *